# 'నేతగారి ఆమెత'

తమది కాకపోతే గంగ వరకూ దేకమన్నారట.

గుడ్డుపెట్టే కోడికిగానీ ఎక్కడో మంట, ఆమ్లెట్ వేసుకుతినే వాళ్లకెందుకుంటుందీ? ఖర్చు ఎవర్దో అయితే యాభైయేమిటి అయిదువందల కేజీల కేకునైనా కసక్కున కోసేయిరూ... అయినా ఖర్చు ప్రభుత్వ ఖజానా భరిస్తోంటే కిందామీదా తెలుస్తుందటండీ!

మన 'గరీబ్ కీ బేటీ' మాయా తన హయాంలో నలభై యేడో పుట్టిన్రోజును చాలా సింపుల్‌గా సెలిబ్రేట్ చేసుకున్నారు.

అందుకు అసలే బీదదైన ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం యింకో పదికోట్లకి బీదదైంది.

"ఎవడబ్బా సొమ్మనీ" అని ఆమె భక్తుడెవడేనా పాడే అవకాశం లేకపోలేదు... ఒరిస్సాలో ఓ అయ్యేఎస్ అధికారి పుట్టిన తద్దినానికి 'చిల్కా' సరస్సుకు వలసొచ్చే పిట్టలు కొట్టబడ్డాయి అన్నం చిన్న సంగతే.

మా కర్నూలు జిల్లా నందికొట్కూరు సమీపాన బట్టమేకపిట్ట బతికి బట్టకట్టడం గొప్ప సంగతేనండోయ్.

దుప్పులూ, కుందేళ్లూ, నెమళ్లూ చలిరాతిరి అడవి నెగళ్లూ అధికారుల రాజకీయాల సరదాలు మామూలే... సింపుల్, అధికారులంటే పెజాపెతినిధులండీ బాబూ... అయ్యా, అమ్మా 'యిదెందుకంటారా? నీక్కడుప్మంట కాపోతే... నీ కొచ్చిన నష్టమేంటి!' అనడుగుతారా? నిజమే, నాకేకాదు మామూలు సగటు మనిషికి (ఓటరుకు) ప్రశ్నించే హక్కు రాజ్యాంగ పుస్తకాల్లో మాత్రమే వుందండీ... నిజంగా లేదండి, అంటే చూశారా నిజానికీ, నిజంగా వున్న అబద్దానికీ తేడా... అర్థం కాలేదా, అయితే మీరు భారతీయ పౌరులుగా వుండ నిషిద్దులు. 'అగ్గి నానుల్ని బహిష్కరించండి'... 'అగినానియోఁకో హఠావో'

* * *

నలభైయేడు కొవ్వొత్తుల్తో ఏభై కేజీల కేకు

ఇది ఉ.ప్ర. రాష్ట్ర రాణిగారి జన్మదినం. ఆ రాణిగారి ముద్దుపేరు 'గరీబ్ కీ బేటీ'. ఆ పేదింటి ఆడపడుచు పుట్టిన్రోజు పండగ సందర్భంగా ఆపాదమస్తకం రాళ్లూ రప్పలూ గవ్వలూ ధరించారు. గిట్టనివాళ్లు వాటిని వజ్రవైఢ్యూర్యాలూ మేలిమి ముత్యాలూ అన్నారు. వాటితోపాటు కొన్ని చిల్లర నగలు కూడా ధరించారు. (ఎంత పేదింటి ఆడపడుచైనా

అలంకరించుకునే హక్కు వుందికదండీ). ఎవరికైనా 'పుట్టిన రోజు పండగే అందరికీ' అయితే యిక్కడ 'అందరికీ' అంటే ఉ.ప్రదేశ ప్రజలందరికీ అని మనం అర్థం చేసుకోవాలి.

సిరిమాన్ పేద బడుగు యువరాణి తన 47వ జన్మదిన పర్వ సందర్భంగా కోసిన ఏభై కిలోల కేకు విలువ తెలీదు కానీండీ... ఆ కేకు కోసేందుకు నిర్మించిన వేదిక నిర్మాణ ఖర్చు మాత్రం అక్షరాలా ఓ కోటి...(మరీ దరిద్రంగా కోటేమిటంటారా?)

ఓ పాతికవేలమంది పట్టే ఓ చిన్న పేద గుడారం ఆ వేదిక... ఆ గుడారం పై స్ఫటిక ఛత్రం... గ్లాస్ సీలింగ్... వాటర్ ప్రూఫ్ సీలింగ్ అని ఇంగ్లీష్ అగ్రవర్ణాల పత్రికలు అరిచి గీపెట్టాయి. కానివ్వండి. ఇది బడుగు ప్రజల రాణిగారి జన్మదినం సంబరం అన్నది వాళ్ల కసి. ప్రభుత్వాధికారులు తమ ప్రియ సోదరి 'గరీబ్ కీ బేటి' జన్మదిన సందర్భంగా సమర్పించిన పుష్పగుచ్ఛాలు ఎలాంటివనుకున్నారు...! వైల్డ్ ఇండిగో, లిలీయం, కార్నేషన్స్, బర్డ్ ఆఫ్ పారడైస్ లాంటి అతి చవక పువ్వులతో తయారైనవి... అవి మన తంగేడు పూల్లాంటివండీ. వాటికి ఇంగ్లీషు పేర్లు పెట్టారంతే.

వివిధ ప్రభుత్వ విభాగాలు శక్తివంచన లేకుండా పండగ విందు జరగడానికి కృషి చేశాయి. ఓ విభాగం మిఠాయిలూ తిండీతిప్పలూ, ఓ విభాగం సంగీతాలు, యింకో విభాగం గుడారం వగైరాలు వెరసీ. ఉ.ప్ర. రాష్ట్రం యింకొంచెం పేదదైంది. ఎంతండీ ఓన్లీ టెన్ క్రోర్స్...బస్ దస్ కరోడ్... పదేపది కోట్లు... ఆ మాత్రానికే!

ఈమెకు పోటీ అన్నట్టు ఢిల్లీలో ఓ సాధారణ ఎమ్మెల్యే తన జన్మదినాన్ని అసాధారణంగా జరుపుకున్నాడు. తన నియోజకవర్గపు ప్రజలందరిచేతా పండగ చేయించాడు. టీవీలో ఓ పేద్ద వ్యాను మీద పెట్టిన అతి పెద్ద కేకును జనాలు ఎగబడి పీక్కుతినే దృశ్యం బహు హృద్యంగా వుండింది.

ఉ.ప్ర. ప్రతిపక్షాలు మాయావతిగారి జన్మదిన వేడుక బహిష్కరించాయి. విప్ జారీ అయ్యిందేమో తెలీదుగాని, ప్రతిపక్ష ఎమ్మెల్యేలు భారీగా బాధపడేవుంటారు... ఎందుకంటే మాయవతిగారికి పుచ్చుకోడం మాత్రమే కాదు ఇచ్చుకోడం కూడా బాగా తెల్సు. ఆహూతులందరికీ ఒక్కో కలర్ టీవీ బహూకరించారు మరి. ఇంతకీ ఆ రోజును సెలవుదినంగా ప్రకటించలేదు కదా!

❊ ❊ ❊

***లక్షలాది బహుజనులు యింకా దరిద్రరేఖకు చాల చాలా దిగువన వుంటూ, చదువులేక, గూడు లేక, కూడు లేక, సభ్య సమాజంలో కనీసపు మానవత్వపు మర్యాదకు కూడా నోచుకోక అలమటిస్తున్నారే! అయ్యా! అమ్మా! మీరు ఎవరికి ప్రాతినిధ్యం వహిస్తున్నారు? మీ నినాదాలు కాదు వీళ్లక్కావల్సింది పిడికెడు మెతుకులు... చిటికెడు ఆరక్షణా భావం..*** ●